

# పసిడిమనసులు - షర్మిల



## నెలనెలా పసిడిమనసులు చెప్పే మనసైన కథలు..!

# అమ్మ కడుపు

గుర్రబ్బండి మా వూరికి ఎప్పుడో గానీ రాదు. ఎందుకో గానీ నా చిన్నతనంలో చుట్టాలు ఎక్కువగానే వచ్చే వారు. మేమూ వెళ్లేవాళ్లం. ఎవరు వచ్చినా అప్పట్లో గూడు రిక్షాల్లో ఎక్కువగా వచ్చేవారు. ఇంతకీ మా ఇంటికి గుర్రబ్బండి వచ్చి ఆగింది. బండీ నడిపే అతను దిగి ఒక ఎత్తుపీట తీసి బండీదిగే మనిషి కోసం వేశాడు. బండిలోనుంచి ఒక పెద్దామె దిగింది. గుర్రబ్బండి అతనే ఒక ట్రంకు పెట్టె దించి వసారాలో పెట్టాడు.

"'ఎవరో చుట్టాలొచ్చారే " అంటా మా నాయనమ్మకి వినబడేలా అరిచాను.

బయటకు వచ్చిన మా నాయనమ్మ వచ్చినావిడను చూసి "సీతమ్మొదినా నువ్వే!? ఎంతకాలమైందీ నిన్ను చూసీ పోన్లే ఇప్పుడన్నా వచ్చావు" అంది.

" చిట్టెమ్మా! దొంకతిరుగుడెందుకు కానీ నీ పంచన పడుంటాను కాస్త చోటియ్యి తల్లీ" అని చెయ్యి పట్టుకుంది.

"'అబ్బో వదినా! నవ్వుతాల కన్నా ఆ మాట అనబాకు ,లంకంత ఇల్లు, పాడీ పంటా, నౌకర్లు,చాకర్లూ షావుకారు సీతమ్మవి, ఇక్కడ పడివుండే కర్మ నీకేంటి వూరుకో " అని మందలించింది చిట్టెమ్మ.

"చిట్టీ ! ఆ రోజులు కాదు ఇప్పుడు మూలబడ్డాక, ఆ మారాజు పోయినాకా అందరికీ బరువయ్యాను. లేకలేక పుట్టిన ఇద్దరు మగబిడ్డల్నీ ప్రాణంగా పెంచాము. కోడళ్లు వచ్చారు మనవల్ని ఎత్తాము. ఆయన పోయిన కొన్నాళ్లు బాగానే జరిగింది. ఆస్తంతా ఇద్దరికీ రాసేశాం నా వొంటిమీద బంగారం తప్ప ఏమీ వుంచుకోలా. ఇక నాతో ఏం పని? రోజు రోజుకి నరకంగా మారింది. నా పోషణ వాళ్లకి భారమంట. ఒకింట్లో నెల వుంటే ఇంకో ఇంట్లో నెల ...వేళకి ఇంత ముద్ద పెట్టాలన్నా ఈసడింపులు. అదేమని అడిగితే సణుగుడు భరించలేకపోతున్నామని చాడీలు చెప్పడం , దానితో నా బిడ్డలే నా మీదే చిరాకు పడతాంటే ఎట్టా భరించనే. పచ్చడిమెతుకులు,పుల్లమజ్జిగ పోసినా సర్దుకున్నా కానీ నోటికి అద్దూ పద్దూ లేకుండా వాగుతాంటే ఎట్టా పడుండమంటావు నువ్వే చెప్పు" అంటా సీతమ్మ గొల్లుమంది.

" పోన్లే వూరుకో కాళ్లు కడుక్కో భోంచేద్దూగాని" అని కాల్చిన వంకాయ బజ్జి పచ్చడి, పప్పు, గడ్డ పెరుగు వడ్డించింది.

"తృప్తిగా తిన్నానే అమ్మా! నువ్వు బాధల్లో వున్నాళ్లని కడుపులో పెట్టుకుంటావని అంతా అంటారు. నన్ను ఓ దారి చేసి పుణ్యం కట్టుకో చిట్టెమ్మా" అంది సీతమ్మ.

"వదినా! ఇక్కడ వుండడం నీకూ సొతంత్రంగా వుండదు. మా బావగారి వాటాలో గది ఖాళీగా వుంది అందులో నిన్నుపెడతాను. బియ్యం,పప్పు,వుప్పు,పాడికి నా ఇంటో లోటులేదు. నీ గదిలో నువ్వు ఆ చారెడు వుడకేసుకో " అని సలహా ఇచ్చింది చిట్టెమ్మ.

"నా పెద్దగొలుసు వుంచు చిట్టెమ్మా!" అంటా గొలుసు తీసి ఇవ్వబోయింది

" సీతమ్మా!" పామును చూసినట్టు బెదిరింది మా నాయనమ్మ.

" వద్దమ్మో! నువ్వు దాన్ని మెళ్లో ఏసుకో. ఆ మాత్రానికి నాకు ఏం తరిగిపోదు. నీ అవసరాలకి నీ దగ్గరున్న తృణమో పణమో వాడుకో"అంది.

ఇక నా పాత్ర మొదలైంది. సీతమ్మ వెనకాలే "మామ్మా,మామ్మా" అంటా తిరగడం మొదలెట్టా. ఆవిడకి కావాల్సిన వంటసామాన్ల , పప్పు, వుప్పులు చేరెయ్యడం, పాలు ఇచ్చి రావడం నా డ్యూటీ.

నేను సీతమ్మకి బాగా చేరికయ్యాను. "మామ్మా" అంటా రోజుకి ఒక్కసారైనా పలకరిస్తా వుండే దాన్ని. "ముసలాళ్ల దగ్గర ఏం కబుర్లు చెప్తావే" అని అందరూ ఏడిపించే వారు. సీతమ్మామ్మ నా చేయి సవరదీస్తా "ఎంత మెత్తగా వుంటావే అమ్మా! మీ నాయనమ్మ ఎంత వెన్నపూస పెట్టి పెంచుతాందో గానీ నీ మనసు కూడా వెన్నపూసే" అనేది.

ఒక రోజు " మావూరి మనిషి ఇక్కడికి గొడ్ల బేరానికి వచ్చి నన్ను చూడడానికి వచ్చాడు , మళ్లీ నన్ను అక్కడకి తీసుకుపోతారంట" అని కన్నీళ్లు పెట్టుకుంది.

" వూరుకో మామ్మా!" అని ఓదార్చాను.

కళ్లు తుడుచుకుంటూ "అయినా నాకేం బయ్యం లేదు ..,ఈసారి నేను క్రిష్ణమ్మ దగ్గరకి వెళ్తా "అంది.

"ఆవిడ ఎవరు?" నేను అడిగాను.

"ఆవిడ మా అమ్మలాంటిద " అంది.

సీతమ్మ వూహించినంతా అయ్యింది ఆవిడ పిల్లలు పరువు తీస్తాందంటా నానాగోలా చేసి తీసుకుపోయారు, ఆవిడ బండి ఎక్కుతుండగా నేను చేయి పట్టుకుని రహస్యంగా అన్నాను "మామ్మా! నాతో చెప్పావుగా మీ క్రిష్ణమ్మ చాలా మంచిదని అక్కడికి వెళ్లు" అన్నాను.

దానికి ఆమె మౌనంగా తలూపింది. మా వూరినుంచి సీతమ్మ ఎళ్లి నెలయ్యిందేమో ఒకరోజు కబురొచ్చింది సీతమ్మ క్రిష్ణా నదిలో దూకేసిందని. అప్పుడుగానీ నా పసి మనసుకు క్రిష్ణమ్మ ఎవరో అర్థం కాలేదు, అమ్మలాంటి క్రిష్ణమ్మ కడుపులో అయినా హాయిగా వుందేమో మా సీతమ్మామ్మ.!!

*(వచ్చేనెల మరో పసిడిమనసు కథ)*

**COMMENTS**